# ఘజియాబాద్ వద్ద రైతాంగంపై కేంద్రప్రభుత్వ పోలీసుల అణచివేత చర్యలను ఖండించండి

రైతాంగ రుణాలు సంపూర్ణంగా రద్దుచేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, రైతాంగ ఆత్మహత్యలను నివారించాలనే ప్రధాన డిమాండ్స్‌తో రైతాంగం మరోసారి కదం తొక్కారు.

ఉత్తరఖండ్ రాష్ట్రం-హరిద్వార్‌లోని తికాయట్ ఘాట్ నుండి ప్రదర్శనగా వేలాదిమంది రైతాంగం సెప్టెంబర్ 23న బయలుదేరి అక్టోబర్ 2న న్యూఢిల్లీలోని కిసాన్ ఘాట్‌కు చేరుకునేవిధంగా బయలుదేరారు. భారతీయ కిసాన్ యూనియన్ (టికాయత్ గ్రూప్) ఇచ్చిన ఈ 'కిసాన్ క్రాంతి యాత్ర' పిలుపుకు స్పందించి దారి పొడవునా వేలాదిమంది రైతాంగం తరలివచ్చి ఈ మహా ప్రదర్శనతో కలిసి సాగారు. అయితే రైతాంగాన్ని న్యూఢిల్లీలోకే ప్రవేశించనీయకుండా కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో మూడువేలమంది సాయుధ పోలీసులు జలఫిరంగులు, భాష్పవాయు గోళాలతో సరిహద్దు రహదారిపై మోహరించారు.

ప్రశాంతంగా ప్రదర్శనగా కిసాన్‌ఘాట్‌కు రైతాంగాన్ని వెళ్ళనీయకుండా లాఠీఛార్జీతో, భాష్పవాయు గోళాలతో, జలఫిరంగులతో విరుచుకుపడ్డారు.

**ఉత్తరాఖండ్ రైతాంగంపై కేంద్రప్రభుత్వ పోలీసు బలగాల నిర్బంధాన్ని, అణచివేత చర్యలను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తీవ్రంగా ఖండిస్తోంది. రైతాంగంపై సాగుతోన్న నిర్బంధాన్ని ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఖండించటంతోపాటు, వారికి సంఘీభావంగా నిలవాల్సిందిగా పిలుపునిస్తోంది.**

పోలీసుల అణచివేత చర్యలను ప్రతిఘటిస్తూనే, చెదిరిపోకుండా వేలాదిమంది రైతాంగం ఘాజిపూర్ రోడ్లపైనే బైఠాయించారు. తమ న్యాయ్యమైన డిమాండ్లను పరిష్కరించకుండా నిర్బంధానికి పాల్పడిన ప్రభుత్వ, పోలీసు చర్యలను నిరసించే నినాదాలతో హోరెత్తించారు.

అక్టోబర్ 2న రాత్రంతా రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. దేశవ్యాపితంగా తమ సమస్యల పరిష్కారంపట్ల పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా రైతాంగంలో పెల్లుబుకుతున్న ఆగ్రహానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తుంది.

రైతాంగ ఆందోళనలు ఉద్రిక్తరూపం దాల్చినపుడు కొన్ని ఉపశమన చర్యలతో పాలకులు సరిపెడుతూ, వ్యవసాయరంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలను వేగవంతం చేస్తున్నారు. ఫలితంగా కౌలురైతులతో సహా రైతాంగం , గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల సమస్యలు నానాటికీ అధికమౌతున్నారు.

ఈ సంక్షోభానికి కారణమైన వ్యవసాయరంగంలో భారత పాలకుల ఒప్పందాలన్నిటినీ రద్దుచేయకుండా, దున్నేవానికే భూమి కల్పించకుండా రైతాంగ మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావని గ్రహించాలి. ఈ దిశగా రైతాంగం తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం సమాజంలోని ఇతర పీడిత విభాగాలతో కలసి ఐక్యపోరాటాలు సాగించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) పిలుపునిస్తోంది.

*విప్లవాభినందనలతో*

విజయవాడ
3-10-18

**ఎస్.ఝాన్సి, అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**

oooooo